# పాలిటీ

## భారత పార్లమెంట్

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరుగాంచిన మన దేశంలో సార్వత్రిక ఎన్నికల్లో వెల్లడైన ప్రజాభిప్రాయం మేరకు అధికారం చేపట్టిన ప్రభుత్వాలు పాలన సాగిస్తాయి. మన దేశంలో అమల్లో ఉన్న 'ప్రజాస్వామ్య వ్యవస్థ' చట్టసభలు, పాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ అనే మూడు మూల స్తంభాలపై ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే కేంద్ర బిందువు. ప్రజలచేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు, చట్టసభల్లో కూర్చుని, ప్రజల ఆశలను, ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా చట్టాలను రూపొందిస్తారు.

- భారత రాజ్యాంగం అయిదో భాగంలో, రెండో అధ్యాయంలో 79 నుంచి 122 వరకు ఉన్న నిబంధనలు కేంద్ర శాసన నిర్మాణశాఖ అయిన పార్లమెంట్ నిర్మాణం, అధికారాలు, విధులను వివరిస్తున్నాయి.
- నిబంధన 79 ప్రకారం పార్లమెంట్ అంటే, రాష్ట్రపతి – లోక్‌సభ – రాజ్యసభ.
- ఇంగ్లండ్‌లో రాజు/ రాణి పార్లమెంట్‌లో అంతర్భాగమైనట్లే మన దేశంలో రాష్ట్రపతిని పార్లమెంట్‌లో అంతర్భాగంగా పరిగణిస్తారు.
- రాష్ట్రపతి పార్లమెంట్ సభ్యుడు కాకపోయినా, ఆయన ఆదేశాలతోనే పార్లమెంట్ సమావేశమవుతుంది, వాయిదా పడుతుంది. ఉభయ సభలు ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి ఆమోదంతోనే శాసనాలుగా రూపొందుతాయి.
- బ్రిటన్ పార్లమెంట్ సార్వభౌమాధికారాన్ని కలిగి ఉంటుంది. భారత పార్లమెంట్ లిఖిత రాజ్యాంగ చట్టానికి లోబడి వ్యవహరించాలి. రాజ్యాంగాన్ని అతిక్రమించి శాసనాలు చేస్తే అవి చెల్లవు.
- పార్లమెంట్ ఉభయ సభలను మొదట్లో House of People అని, House of Council అని వ్యవహరించేవారు.
- 1954లో గణేష్ వాసుదేవ్ మౌలాంకర్ ఉభయసభలకు లోక్‌సభ – రాజ్యసభ అనే పేర్లు ప్రతిపాదించారు.

### లోక్‌సభ

- రాజ్యాంగం 81 నిబంధన ప్రకారం లోక్‌సభ సభ్యులను ప్రజలే ప్రత్యక్షంగా ఓటువేసి ఎన్నుకుంటారు. లోక్‌సభ సభ్యులు ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తారు.
- లోక్‌సభను ప్రజాప్రతినిధుల సభ, దిగువ సభ అనికూడా వ్యవహరిస్తారు.
- రాజ్యాంగ రీత్యా లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 552 ప్రస్తుతం సభ్యుల సంఖ్య 545.
- 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణ వల్ల, ఏడో (7) రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం, రాష్ట్రాలను జనాభా ప్రాతిపదికన ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించి, ఒక్కొక్క నియోజకవర్గం నుంచి ఒక్కొక్క సభ్యుడికి చొప్పున ప్రాతినిధ్యం కల్పించారు.
- 1971లో జనాభా లెక్కల్లో పెరిగిన జనాభా ప్రకారం, 31వ రాజ్యాంగ సవరణ చట్టం 1973 ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను 500 నుంచి 545 కు పెంచారు.
- వివిధ రాష్ట్రాల నుంచి 530 మంది సభ్యులను, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 13 మంది సభ్యులను ఎన్నుకుంటారు.
- నిబంధన 331 ప్రకారం రాష్ట్రపతి ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను లోక్‌సభ సభ్యులుగా నియమిస్తారు.
- అవిభక్త ఆంధ్రప్రదేశ్ నుంచి 42 మంది లోక్‌సభ సభ్యులుండేవారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మందిని, తెలంగాణ నుంచి 17 మందిని లోక్‌సభ సభ్యులుగా ఎన్నుకుంటారు.
- గరిష్ఠ లోక్‌సభ సభ్యులు ఉన్న రాష్ట్రం: ఉత్తర్ ప్రదేశ్, 80 మంది సభ్యులు.
- ఈశాన్య రాష్ట్రాల్లో గరిష్ఠ లోక్‌సభ సభ్యులు ఉన్న రాష్ట్రం: అసోం, 14 మంది సభ్యులు.
- కనిష్ఠ అతి తక్కువ సభ్యులు ప్రాతినిధ్యం వహించే రాష్ట్రాలు: సిక్కిం – 1; నాగాలాండ్ – 1; మిజోరాం – 1
- కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ సభ్యులు: దిల్లీ నుంచి – 7; చండీగఢ్ – 1; పుదుచ్చేరి – 1; దాద్రానగర్‌హవేలీ నుంచి – 1; లక్షద్వీప్ – 1; అండమాన్ నికోబార్ – 1; డయ్యూడామన్ – 1. (మొత్తం 13 మంది సభ్యులు).

- ✪ 330 నిబంధన ప్రకారం లోక్‌సభ స్థానాల్లో 84 షెడ్యూల్డ్ కులాల వారికి, 47 స్థానాలను షెడ్యూల్డ్ తెగలవారికి కేటాయించారు.
- ✪ కేటాయించిన స్థానాల నుంచి ఆ సామాజిక వర్గం వారు మాత్రమే పోటీచేయాలి.
- ✪ 2001లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల నియోజకవర్గాల సంఖ్య 2026 వరకు పెంచకూడదని నిర్ణయించారు.
- ✪ 2003లో 96వ రాజ్యాంగ సవరణ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని నిర్దేశించింది.
- ✪ విశ్రాంత న్యాయమూర్తి కులదీప్‌సింగ్ నేతృత్వంలో లోక్‌సభ, రాష్ట్ర విధానసభల నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) సభ్యుల సంఖ్య పెంచకుండా చేశారు.

**లోక్‌సభ సభ్యుల అర్హతలు**

- ★ లోక్‌సభ సభ్యుడిని మెంబర్ ఆఫ్ పార్లమెంట్ (లోక్‌సభ) అంటారు.
- ★ సార్వత్రిక, వయోజన – ప్రత్యక్ష – రహస్య – ఓటింగ్ విధానం ద్వారా లోక్‌సభ సభ్యులను ప్రజలే ఎన్నుకుంటారు.
- ★ 84వ నిబంధన ప్రకారం లోక్‌సభకు పోటీచేయడానికి 25 సంవత్సరాలు నిండిన భారత పౌరుడై ఉండాలి. దేశంలో ఏదో ఒక నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి. పార్లమెంట్ చట్టరీత్యా నిర్ణయించిన అర్హతలు ఉండాలి.
- ★ ఎన్నికల నిర్వహణకు 324వ నిబంధన ప్రకారం ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. 326వ నిబంధన ప్రకారం పౌరులకు ఓటు హక్కు కల్పిస్తారు.
- ★ 327వ నిబంధన ప్రకారం ప్రజాప్రాతినిధ్య చట్టం (Representation of People Act) 1950; 1951 రెండు చట్టాలు చేశారు.
- ★ 1950 చట్టంలో లోక్‌సభ స్థానాల కేటాయింపు; ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా తయారీ మొదలైన విషయాలు పేర్కొన్నారు.
- ★ 1951 చట్టంలో ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల అర్హతలు – అనర్హతలు, అక్రమాలు, ఎన్నికల్లో నేరాలు, అప్పీళ్లు మొదలైనవి వివరించారు.

## సభ్యుల వేతనాలు

లోక్‌సభ సభ్యులకు కొంత (రూ. 1,42,000) గౌరవ వేతనంతో పాటు సమావేశకాలంలో అలవెన్సు – ఆఫీసు ఖర్చులు, నియోజకవర్గం నుంచి పార్లమెంట్‌కు హాజరుకావడానికి ఉచిత విమాన ప్రయాణం, నియోజకవర్గంలో పర్యటించడానికి అలవెన్సు, టెలిఫోన్ ఖర్చులు, వైద్య ఖర్చులు, దిల్లీలో నివాస గృహం మొదలైన సౌకర్యాలు కల్పిస్తారు.

**ఇతర అంశాలు**

- ★ లోక్‌సభకు సంబంధించి 'ప్రోరోగ్', 'డిసాల్వ్' అనే రెండు పదాలు వింటాం.
- ★ రాష్ట్రపతి ఆదేశంతో సమావేశంలో ఉన్న లోక్‌సభ ప్రోరోగ్ అయ్యిందంటే సమావేశాలు ముగిసినట్లు, మళ్లీ సమావేశాలు ఏర్పాటు చేసే వరకు విరామం అని అర్థం.
- ★ ఈ సమయంలో పరిశీలనలో ఉన్న బిల్లులు రద్దుకావు.
- ★ 'డిసాల్వ్' అంటే రద్దయ్యిందని అర్థం. ప్రత్యేక పరిస్థితుల్లో ప్రధాని సలహాతో రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకుంటారు. ఈ సమయంలో లోక్‌సభ పరిశీలనలో ఉన్న బిల్లులు రద్దవుతాయి.
- ★ రెండు సభల ఆమోదం పొందిన బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపిన తర్వాత లోక్‌సభ రద్దయితే, ఆ బిల్లు భవిష్యత్ తెలిపే నిబంధన ఏదీ రాజ్యాంగంలో లేదు. ఇంతవరకు అటువంటి పరిస్థితి రాలేదు.
- ★ అలాంటి బిల్లులు బ్రిటన్‌లో రద్దవుతాయి – ఎం.ఎస్. కౌల్ అభిప్రాయం ప్రకారం మన దేశంలో కూడా అలా చేయాలి.

## కోరం

లోక్‌సభ కార్యక్రమాలకు హాజరు కావాల్సిన కనీస సభ్యుల సంఖ్యను 'కోరం' అంటారు. మొత్తం సభ్యుల్లో 1/10వ వంతు సభ్యులు (55 మంది) సమావేశానికి హాజరుకావాలి. లేకపోతే సభా కార్యక్రమాలను వాయిదా వేస్తారు.

www.eenadupratibha.net

## సమావేశాలు

- ★ 85వ నిబంధన ప్రకారం 6 నెలల వ్యవధిలో, సంవత్సరంలో కనీసం రెండుసార్లు లోక్‌సభ సమావేశాలు జరగాలి.
- ★ సంప్రదాయం ప్రకారం ఫిబ్రవరి – మార్చిలో బడ్జెట్ సమావేశాలు, జులై – ఆగస్టులో వర్షాకాల సమావేశాలు, నవంబరు – డిసెంబరులో శీతాకాల సమావేశాలు సంవత్సరానికి మూడుసార్లు జరుగుతాయి.
- ★ సమావేశాలకు అధ్యక్షత వహించి సభా కార్యక్రమాల నిర్వహణకు సభ్యుల్లో ఒకరిని అధ్యక్షుడిగా, వేరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ★ 1950 ఈ పదవికి 'స్పీకర్' అని నామకరణం చేశారు.
- ★ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత 1950లో మొదటి లోక్‌సభ స్పీకర్ జి. వి. మౌలాంకర్, తొలి ఉపసభాపతి అనంతశయన అయ్యంగార్.
- ★ ప్రస్తుత లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ – డిప్యూటీ స్పీకర్ తంబిదురై.
- ★ రెండు పర్యాయాలు లోక్‌సభను మధ్యంతరంగా రద్దు చేసి ఎన్నికలు జరిపించిన ఏకైక రాష్ట్రపతి ఆర్. వెంకటరామన్.

## లోక్‌సభ కాల పరిమితి

- ★ 83వ నిబంధన ప్రకారం లోక్‌సభ కాలపరిమితి (గడువు) అయిదు సంవత్సరాలు.
- ★ అత్యవసర పరిస్థితి కాలంలో ఒక తీర్మానం ద్వారా ఒక సంవత్సరం పాటు పొడిగించవచ్చు.
- ★ 85 (c) ప్రకారం కొన్ని అనివార్య పరిస్థితుల్లో లోక్‌సభను ముందుగా రద్దు చేసి, తిరిగి ఎన్నికలు నిర్వహించవచ్చు.
- ★ ఇంతవరకు లోక్‌సభను గడువు పూర్తవక ముందు 7 సార్లు మధ్యంతరంగా రద్దుచేసి, తిరిగి ఎన్నికలు నిర్వహించారు.
- ★ 85 (c) ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో ప్రధాని సలహాతో రాష్ట్రపతి లోక్‌సభను రద్దుచేసి, మధ్యంతర ఎన్నికలు నిర్వహించిన సందర్భాలు...

1. 1970, డిసెంబరు 27న ప్రధాని ఇందిరాగాంధీ సలహా మేరకు అప్పటి రాష్ట్రపతి వి.వి.గిరి లోక్‌సభను రద్దుచేయగా 1971 మార్చిలో తిరిగి ఎన్నికలు నిర్వహించారు.
2. 1979 ఆగస్టులో ప్రధాని చరణ్‌సింగ్ సలహాతో రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి లోక్‌సభను రద్దు చేశారు. 1980 మార్చిలో మధ్యంతర ఎన్నికలు నిర్వహించారు.
3. 1989లో ప్రధాని రాజీవ్‌గాంధీ సలహాతో, రాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ లోక్‌సభను రద్దు చేశారు. 1989 డిసెంబరులో ఎన్నికలు జరిగాయి.
4. 1991 మార్చిలో ప్రధాని చంద్రశేఖర్ సలహాతో రాష్ట్రపతి ఆర్.వెంకట్రామన్ లోక్‌సభను రద్దు చేశారు. 1991 జూన్‌లో ఎన్నికలు జరిగాయి.
5. 1997 డిసెంబరులో ప్రధాని ఐ.కె. గుజ్రాల్ సలహాతో రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ లోక్‌సభను రద్దు చేసి, 1998 మార్చిలో ఎన్నికలు నిర్వహించారు.
6. 1999 ఏప్రిల్‌లో ప్రధాని వాజ్‌పేయీ సలహాతో రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ లోక్‌సభను రద్దు చేశారు. 1999 అక్టోబరులో ఎన్నికలు జరిగాయి.
7. 2004 ఫిబ్రవరిలో ప్రధాని వాజ్‌పేయీ సలహాతో రాష్ట్రపతి అబ్దుల్‌కలాం లోక్‌సభను రద్దు చేయగా, 2004 మే నెలలో ఎన్నికలు నిర్వహించారు.

## రాజ్యసభ

- ★ దీన్ని కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్, ఎగువసభ, మేధావుల సభ శాశ్వత సభ అని కూడా అంటారు.
- ★ రాజ్యాంగ రీత్యా రాజ్యసభ సభ్యుల సంఖ్య: 250.
- ★ ప్రస్తుతం 245 మంది సభ్యులున్నారు.

★ 229 మంది సభ్యులను వివిధ రాష్ట్రాల విధానసభల సభ్యులు నైష్పత్తిక – ఓటుబదిలీ పద్ధతిలో ఎన్నుకుంటారు.

★ కేంద్రపాలిత ప్రాంతాల నుంచి నలుగురు సభ్యులను రాజ్యసభకు ఆ ప్రాంతాల శాసనసభ్యులు ఎన్నుకుంటారు.

★ 80(3) నిబంధన ప్రకారం రాష్ట్రపతి కళలు – సాహిత్యం, శాస్త్ర సాంకేతిక రంగం, సామాజిక సేవా రంగాల్లో 12 మంది ప్రముఖులను రాజ్యసభ సభ్యులుగా నియమిస్తారు.

★ అమెరికా సెనేట్ లాగా అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం లేదు.

★ రాష్ట్ర జనాభాను బట్టి రాజ్యసభ సభ్యుల సంఖ్యను నిర్ణయించారు.

★ అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో 18 మంది రాజ్యసభ సభ్యులుంటే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి 11 మంది, తెలంగాణా నుంచి ఏడుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

★ ఈశాన్య రాష్ట్రాల్లో గరిష్ఠ రాజ్యసభ సభ్యులు ఉన్న రాష్ట్రం: అసోం (7).

★ దేశంలో గరిష్ఠ రాజ్యసభ సభ్యులు ఉన్న రాష్ట్రం: ఉత్తర్‌ప్రదేశ్, 31 మంది.

★ అతి తక్కువ ప్రాతినిధ్యం ఉన్న రాష్ట్రాలు: మణిపూర్ – 1; మిజోరం – 1; అరుణాచల్‌ప్రదేశ్ – 1; సిక్కిం – 1; గోవా – 1.

★ కేంద్రపాలిత ప్రాంతాలలో దిల్లీ నుంచి – 3; పుదుచ్చేరి – 1; మొత్తం నలుగురు సభ్యులు.

★ రాజ్యసభ స్థానాల్లో ఏ వర్గాల వారికీ కేటాయింపులు లేవు.

★ రాజ్యసభ సభ్యుడిని మెంబర్ ఆఫ్ పార్లమెంట్ (రాజ్యసభ) MP అంటారు.

**అర్హతలు**

రాజ్యసభకు పోటీ చేయడానికి – 30 సంవత్సరాలు నిండిన భారత పౌరుడై ఉండాలి. పార్లమెంట్ చట్టం ద్వారా నిర్దేశించిన అర్హతలుండాలి.

★ రాజ్యసభ సభ్యుడి పదవీకాలం ఆరు సంవత్సరాలు. ఈ సభ ఎప్పుడూ పూర్తిగా రద్దుకాదు.

★ ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి 1/3వ వంతు సభ్యులు పదవీ విరమణ చేస్తారు. తిరిగి ఎన్నికలు నిర్వహించి, కొత్తవారిని ఎన్నుకుంటారు. అందువల్ల ఈ సభను శాశ్వతసభ అంటారు.

**కోరం**

లోక్‌సభలోలాగా మొత్తం సభ్యుల్లో కనీసం 1/10వ వంతు సభ్యులు (25 మంది) హాజరు కావాలి. లేకుంటే సభా కార్యక్రమాలను వాయిదా వేస్తారు.

★ సభా కార్యక్రమాల నిర్వహణకు (అధ్యక్షుడిగా) పదవి రీత్యా ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

★ డిప్యూటీ ఛైర్మన్‌గా సభ్యుల్లో ఒకరిని ఎన్నుకుంటారు.

★ రాజ్యసభ తొలి ఛైర్మన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ప్రస్తుత ఛైర్మన్ ఎం. వెంకయ్యనాయుడు.

★ తొలి డిప్యూటీ ఛైర్మన్ ఎస్.వి. కృష్ణమూర్తిరావు. ప్రస్తుత డిప్యూటీ ఛైర్మన్ పి.జె కురియన్.

**వేతనాలు – సౌకర్యాలు**

లోక్‌సభ సభ్యులతో సమానంగా రాజ్యసభ సభ్యులకు గౌరవ వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

**రచయిత: మెరుపుల నారాయణమూర్తి**